క్లుప్తంగా

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

అంబాజీపేట: శుచికరమైన పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఎంఈఓ-1, 2లు కె.వెంకటేశ్వరరావు, ఎం.ప్రకాష్‌లు విద్యార్థులకు సూచించారు. శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా శుభదిన్ తిథి భోజన కార్యక్రమాన్ని ఇసుకపూడి, పసువల్లిలో సోమవారం నిర్వహించారు. పసువల్లిలో 16 రకాలతో విద్యార్థులకు శుభదిన్ భోజనాన్ని ఆయా పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు ఏర్పాటు చేశారు.

పెయింటర్‌కు రూ.10 వేల సాయం


మహేష్‌కు సాయం అందిస్తున్న సుబ్బారావు

మామిడికుదురు: మొగలికుదురు గ్రామానికి చెందిన పెయింటర్ కడిమి మహేష్ పెయింటింగ్ వర్క్ చేస్తూ రెండో అంతస్తు నుంచి కింద పడిపోయి వెన్నుపూసకు తీవ్ర గాయమైంది. అమలాపురం ప్రైవేటు ఆస్పత్రిలో అతనికి చికిత్స జరిగింది. ఈ కుటుంబానికి శంకరగుప్తానికి చెందిన బెటర్ లైఫ్ సర్వీస్ ఆర్గనైజేషన్ సభ్యులు సమకూర్చిన రూ.10 వేల ఆర్థిక సాయాన్ని స్థానికులు జాలెం సుబ్బారావు ద్వారా మహేష్ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మొల్లేటి శ్రీనివాస్, కోళ్ల సురేష్ బాబు, రాజా పాల్గొన్నారు.

సహజ కవి వెంకట్‌కు సన్మానం


సహజ కవి వెంకట్‌ను సన్మానిస్తున్న ప్రముఖులు

అంబాజీపేట: జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో భాగంగా ఈ నెల 28న కాకినాడలో పీఆర్ ప్రభుత్వ కళాశాల ఆడిటోరియంలో శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో స్థానిక సహజ కవి పాలమూరి వెంకట్‌ను ఘనంగా సత్కరించారు. కవి సమ్మేళనంలో వెంకట్ తన ప్రతిభతో అందరినీ ఆకట్టుకుని మన్ననలు పొందాడు. ప్రముఖ కవులు, రచయితలు, కళాకారుల సమక్షంలో కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, నన్నయ యూనివర్సిటీ సహాయ ఆచార్యులు డాక్టర్ తరపట్ల సత్యనారాయణ, కొల్లి రమావతి, జి.ఈశ్వరి భూషణం, భూపతి సుమశ్రీ తదితరులు పాల్గొన్నారని వెంకట్ వివరించారు.

వరద తాకిడికి గురైన గ్రామాల్లో వైద్య శిబిరాలు


అప్పనపల్లిలో ఉచిత వైద్య సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

మామిడికుదురు: గోదావరి వరద కారణంగా ముంపు తాకిడికి గురైన గ్రామాల్లో నగరం, లూటుకుర్రు పీహెచ్‌సీల ఆధ్వర్యంలో నాలుగు రోజుల నుంచి ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా వైద్య సేవలందిస్తున్నారు. పెదపట్నం, అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, పాశర్లపూడి, పాశర్లపూడిలంక గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాల ద్వారా గోదావరి వరద బాధితులకు ఉచిత వైద్య సేలందిస్తున్నారు. అప్పనపల్లి గ్రామంలోని పుష్కర ఘాట్, ఉచ్చులవారిపేట, గెద్దం వారిపేట, సాకావారిపేటల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ శిబిరాలను సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో గెద్దం వెంకటేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీలు నిఖిత, లక్ష్మీనాగదుర్గ, హెల్త్ అసిస్టెంట్ యజ్ఞేశ్వరరావు, ఏఎన్ఎంలు శ్రీదేవి, సంతోషి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు ఆహారం పంపిణీ

అంబాజీపేట: వరద ముంపునకు గురైన బాధిత కుటుంబాలకు జనసేన పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఆహార పొట్లాలను సోమవారం పంపిణీ చేశారు. ముంపునకు గురైన నందంపూడి శివారు బొంతువారిపేట, రజకపేటల్లో సోమవారం నాయకులు పర్యటించారు. ముంపుబారిన పడిన కుటుంబాలకు ఆహారం అందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సుంకర బాలాజీ, అరిగెల సూరిబాబు, కొప్పినీడి సాయిసూర్య, పితాని వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ పేరు ప్రకటనపై హర్షం

అంబాజీపేట: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెట్టడంపై అంబాజీపేట విశ్వహిందూ పరిషత్ మండల శాఖ ధర్మ ప్రచారక్ అధ్యక్షుడు కడలి వెంకటేశ్వరరావుతో పాటు పరిషత్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కోనసీమ జిల్లాకు చెందిన డొక్కా సీతమ్మ ఎంతో మంది అన్నార్తుల ఆకలి తీర్చారని ఆమె పేరు పెట్టడం అభినందనీయమన్నారు.


పి.గన్నవరంలో వరద ఉధృతి


అప్పనపల్లిలో ముంపుబారిన పడిన అరటి తోట


నాగుల్లంకలో ఇంటిలోకి చేరిన వరదనీరు


సఖినేటిపల్లిలో వరద బాధితులకు సిద్ధం చేసిన ఆహారపొట్లాలు

కొనసాగుతున్న వరద

- స్తంభించిన రాకపోకలు
- ముంపుబారిన పడిన కాలనీలు


మానేపల్లి శివారు శివాయలంకలో ఆహార పొట్లాల కోసం క్యూలో వరద బాధితులు


ఊడిమూడిలంక నుంచి వృద్ధుడిని బోటులో తీసుకువస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం


అయినవిల్లిలంకలో వరదనీటిలో పడవపై అరటిగెలలు తరలించి ఆటో లోడు చేస్తున్న రైతులు

మామిడికుదురు: గోదావరి వరద ఉప్పొంగడంతో తీర గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. మామిడికుదురు మండలంలోని ప్రధాన రహదారులను సోమవారం వరద పూర్తిగా ముంచెత్తింది. దీంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాలకు రోడ్డు రవాణా పూర్తిగా నిలిచిపోయింది. మామిడికుదురు శివారు కొర్లగుంటలోని అప్పనపల్లి హిమాన్షుశుక్లా వారధి మీదుగా ట్రాక్టర్ల ద్వారా మూడు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించారు. మూడు ట్రాక్టర్లను ఆ ప్రాంతంలో ఏర్పాటు చేయడంతో వాటి ద్వారానే లంక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించారు. అప్పనపల్లి గ్రామం పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. బి.దొడ్డవరం ఇందిరమ్మ కాలనీతో పాటు పలు ప్రాంతాలు ముంపుబారిన పడ్డాయి. పెదపట్నంలంకలో లంకపేటకు వెళ్లే రహదారి ముంపుబారిన పడడంతో స్థానిక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెదపట్నం రత్నాపురం, అరుంధతీ పేట, పాశర్లపూడి బాడవ మత్స్యకారుల పేట, పాశర్లపూడి, పాశర్లపూడిలంక సరిహద్దులోని రెండు మత్స్యకార ప్రాంతాల వాసులు గోదావరి వరదతో తీవ్ర అవస్థలు పడ్డారు. లంక గ్రామాల్లోని అరటితోటలతో పాటు కూరగాయల తోటలు ముంపుబారిన పడ్డాయి. మరో మూడు రోజుల పాటు వరద ప్రభావం ఉంటుందని తీర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముంచెత్తిన వరద

సఖినేటిపల్లి: గోదావరికి వరద పోటెత్తింది. సఖినేటిపల్లి మండలంలోని లంక గ్రామాలు జలమయమయ్యాయి. అప్పనరామునిలంక, సఖినేటిపల్లిలంక, రేవు ప్రాంతాలు నీటమునిగాయి. రెవెన్యూ అధికారులు ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టారు. బాధితులకు ఆహార పొట్లాల పంపిణీ చేపట్టి, తాగునీరు కూడా అందిస్తున్నారు.

కొనసాగుతున్న వరద ఉధృతి

పి.గన్నవరం: ఎగువ ప్రాంతాల్లో వరద తగ్గుముఖం పట్టినప్పటికీ వశిష్ఠ, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో గత 9 రోజులుగా లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లంక గ్రామాల నుంచి పడవలపై బయటకు వచ్చేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పశుగ్రాసం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిలంక, మానేపల్లి శివారు శివాయలంక, పల్లిపాలెం, చినకందాలపాలెం, వాడ్రేవుపల్లి శివారు చినకందాలపాలెం గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. కోనసీమ జిల్లాకు సరిహద్దులో ఉన్న పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక, పుచ్చల్లంక, చాకలిపాలెం శివారు కనకాయలంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. కొత్తపేట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ, తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపీడీఓ త్రిశూలపాణి తదితరులు వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించి, పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

లంక వాసుల అవస్థలు వర్ణనాతీతం

అయినవిల్లి: వరద వచ్చి తమ కష్టాలు, అవస్థలు మిగిలించిందని లంక ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం సాయంతోనే మరలా లంక ప్రజల అవస్థలు తీరతాయంటున్నారు. మండలంలోని వరదలు వచ్చి మడుపల్లిలంక, వీరవల్లిపాలెం, చింతనలంక, అయినవిల్లిలంక, పొట్టిలంక, కొండుకుదురులంక, తొత్తరమూడిలోని కె.పెదలంక గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లోకి వరదనీరు వచ్చి ముచ్చెత్తింది. దీంతో తమ ఇళ్లలోని వరదనీరు చేరిందని, తమ పంట పొలాలను ముచ్చెంత్తిదని, అరటి, కోకో, బొప్పాయి, కూరగాయ పంటలు ముంపులో ఉన్నాయని అవి ఎందుకూ పనిచేయకుండా కుళ్లిపోయాయని రైతులు వాపోతున్నారు. కనీసం పశువులకు పసుగ్రాసం కూడా పెట్టలేని స్థితిలో ఉన్నామని ప్రభుత్వమే తమను ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నారు. వరదలు, వర్షాలతో రోగాల భయం తమను వెంటాడుతోందని తగిన వైద్యం సాయం అందించాలని కోరుతున్నారు. పారిశుధ్య పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు. ముక్తేశ్వరం-అయినవిల్లిలంక ఎదురుబిడెం కాజ్‌వే వద్ద లంక ప్రజలు రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నాయి. ముక్తేశ్వరం శ్మశానవాటిక మునగడంతో రహదారి చెంతనే మృతదేహాలకు అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

అనారోగ్యంతో ఉన్న వృద్ధుడిని బోటుపై తీసుకువచ్చిన ఎన్‌డీఆర్ఎఫ్

పి.గన్నవరం: ఊడిమూడిలంకలో అనారోగ్యంతో బాధపడుతున్న ఒక వృద్ధుడిని ఎన్‌డీఆర్ఎఫ్ దళాలు సోమవారం సాయంత్రం వరద ఉధృతిలో బోటుపై బెల్లంపూడి గ్రామానికి తీసుకువచ్చారు. అక్కడి నుంచి రెవెన్యూ అధికారులు 108 అంబులెన్స్‌లో అతడిని పి.గన్నవరం సీహెచ్‌సీకి తరలించారు. ఊడిమూడిలంకకు చెందిన పిట్టా నారాయుడు అనే వృద్ధుడు ఏడాదిగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం అతడి ఆరోగ్యం క్షీణించడంతో ఆస్పత్రికి తరలించాల్సి వచ్చింది. నడవలేని స్థితిలో ఉన్న నారాయుడిని వరద ఉధృతి కారణంగా బయటకు తీసుకురాలేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు వీఆర్వోలు కె.భగవాన్, ఎస్.దుర్గాప్రసాద్‌లకు తెలిపారు. వారు రెవెన్యూ అధికారులతో మాట్లాడి ఎన్‌డీఆర్ఎఫ్ బోటు ద్వారా బెల్లంపూడి గ్రామానికి తరలించారు.

సూపర్ సిక్స్ ఎప్పటికి అమలు చేస్తారు


జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

మామిడికుదురు: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను తక్షణం అమలు చేయాలని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు డిమాండ్ చేశారు. ఆయన మామిడికుదురులో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 50 రోజులు దాటినా ఎక్కడా సూపర్ సిక్స్ పథకాల ప్రస్తావన లేకపోవడం బాధాకరమన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని గుర్తు చేశారు. కానీ సీఎం చంద్రబాబు హామీలను ఏవిధంగా ఎగ్గొట్టాలా అని ఆలోచిస్తున్నారన్నారు. హామీల పేరిట ప్రజల్ని మోసగించడం తగదన్నారు. తప్పుడు ప్రచారంతో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించడమే ధ్యేయంగా కూటమి నేతలు పని చేస్తున్నారని, విమర్శలు మాని మీ సత్తా ఏంటో పాలనలో చూపాలని వేణుగోపాలరావు డిమాండ్ చేశారు. పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం చేతకాని కూటమి ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌తో కాలక్షేపం చేస్తోందన్నారు. మార్పు అంటే వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించడం, వారిని హత్య చేయడమేనా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ నేతలపై దాడులు ఆపకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు.

వరద ముంపు బాధితులను పట్టించుకోని అధికారులు


నందంపూడిలో ముంపుబారిన పడిన బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ వరలక్ష్మి

అంబాజీపేట: వరద ప్రభావంతో ముంపుబారిన పడిన బాధిత కుటుంబాల ఇబ్బందులను పట్టించుకోవడంలో అధికారులు విఫలమయ్యారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వి.ఇంద్రశేఖర్ పేర్కొన్నారు. వరద ముంపునకు గురైన నందంపూడి శివారు బొంతువారిపాలెం, తొండవరం హైస్కూల్ కాలనీ, రజకల కాలనీలను సోమవారం ఎంపీపీతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు పరిశీలించారు. ముంపుబారిన పడిన బాధితులు మాట్లాడుతూ గత వారం రోజులుగా నీటిలో నానుతున్నా ఏ అధికారి వచ్చిన దాఖలాలు లేవన్నారు. తూతూ మంత్రంగా మంచినీటిని మాత్రం అందించి చేతులు దులుపుకున్నారని ఎంపీపీ వద్ద వాపోయారు. ఓ పక్క ప్రమాద భరితంగా వరద ప్రవహిస్తూ గ్రామాల్లోని కాలనీల్లోకి డ్రైనేజీల ద్వారా నీరు చేరి నివాస ప్రాంతాలను ముంచెత్తితే అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం దారుణమని వారు అన్నారు. తక్షణమే అధికారులు స్పందించి ఇళ్లు నీట మునిగిన బాధిత కుటుంబాలకు సాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, పార్టీ నాయకులు పితాని వీరాస్వామి, మద్దింశెట్టి మల్లిబాబు, నాగాబత్తుల శశి, పేరాబత్తుల కొండలరావు తదితరులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే 'అల్లూరి'కి ఘన నివాళులు


కృష్ణంరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాపాక తదితరులు

సఖినేటిపల్లి: మండలంలోని సఖినేటిపల్లిలో రాజోలు మాజీ ఎమ్మెల్యే అల్లూరి కృష్ణంరాజు వర్ధంతి సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, మాజీ ఎమ్మెల్సీ చైతన్యరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు కేఎస్ఎన్ రాజు, కేవీ చంటిరాజు, లింగోలు పెద్దబ్బులు, సర్పంచ్ గొల్లమండల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏసీ బహూకరణ



ఏసీ బహూకరించిన ఏబీసీ దేవ్‌ను అభినందిస్తున్న ఎంఈఓ లీలావతి

కొత్తపేట: కవి, రచయిత అద్దంకి కేశవరావు సతీమణి అద్దంకి పద్మావతి శత జయంతిని వారి కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. వారి కుమారుడు ప్రియదర్శినీ కరస్పాండెంట్ ఏబీసీ దేవ్ మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు పద్మావతి, కేశవరావు కొత్తపేట, వాడపాలెం పాఠశాలల్లో సుమారు 30 సంవత్సరాలు ఉపాధ్యాయులుగా పనిచేసిన నేపథ్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా దేవ్ ఆధ్వర్యంలో ఆయన కుటుంబ సభ్యులు సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మండల విద్యాశాఖ కార్యాలయం (ఎంఆర్‌సీ)కు ఏసీ ఏర్పాటు చేశారు. వాడపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్ఏగా పనిచేస్తున్న పద్మావతి కోడలు గౌరీకృష్ణ శిక్షా సప్తాహ్ తిథి భోజనానికి అదనంగా ఆ పాఠశాల విద్యార్థులందరికీ రూ.5,000 వ్యయంతో స్వీట్స్ సమకూర్చారు. తల్లి శత జయంతిని పురస్కరించుకుని వివిధ రూపాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఎంఆర్‌సీ కార్యాయానికి ఏసీని సమకూర్చడంపై ఏబీసీ దేవ్‌ను, ఆయన కుటుంబ సభ్యులను ఎంఈఓలు ఎం.హరిప్రసాద్, కె.లీలావతి అభినందించారు.

చురుగ్గా లెప్రసీ సర్వే

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో లెప్రసీ సర్వే చురుగ్గా జరుగుతుంది. లెప్రసీ నివారణ పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలోని వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారు. శరీరంపై అనుమానితమైన రీతిలో మచ్చలు ఉంటే సత్వరమే పీహెచ్‌సీ అధికారులకు సమాచారాన్ని చేరవేసి సంబంధిత కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు.

తెగిన విద్యుత్ తీగలు


మలికిపురంలో కూలిన విద్యుత్ స్తంభం

మలికిపురం: స్థానిక సబ్‌స్టేషన్ రోడ్‌లో ఆదివారం రాత్రి కొబ్బరి చెట్టు పడిపోవడంతో ఇన్కమింగ్ డబుల్ సర్క్యూట్ ఫీడర్లు రెండు, మూడు డబుల్ సర్క్యూట్ పోల్స్ విరిగి పోయి విద్యుత్ వైర్లు చెల్లా చెదురుగా పడి పోయాయి. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. నిత్యం రద్దీగా ఉండే ఈ సెంటర్లో ఎవరికీ ప్రమాదం జరగక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. సాలిపేట ఏరియాలో ఈ సంఘటన జరిగిన వెంటనే భూపతివారి పేట యూత్ సహాయంతో వాటన్నిటిని తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అసిస్టెంట్ ఇంజినీర్ మద్దూరి సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ఎంఈఓ విజయశ్రీ

మలికిపురం: మండలంలోని బట్టేలంక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దాతలు సమకూర్చిన పుస్తకాలను సోమవారం అందించారు. కార్యక్రమానికి జూనియర్ కళాశాల, ప్రిన్సిపాల్ నేదునూరి హనుమంతరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు అడబాల సత్య శ్రీనివాస్ ప్రోత్సాహంతో రూ.14 వేలతో ఇదే పాఠశాల ఆవరణలో నడుస్తున్న కళాశాల ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు, ఎంఈవో ఎం.విజయశ్రీ, సర్పంచ్ బోనం సీతామహాలక్ష్మి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ గంటా మురళి, రొక్కం శేఖర్, అడబాల సత్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

పలువురికి మంత్రి సుభాష్ సాయం


వెంకటేశ్వరరావు భార్య భారతికి ఆర్థిక సాయం అందజేస్తున్న మంత్రి సుభాష్

మామిడికుదురు: కొమరాడ గ్రామానికి చెందిన పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, అతని కుమారుడు త్రినాథ్‌శివప్రసాద్ కరోనాతో మృతి చెందారు. వారి కుటుంబానికి అన్నగా అండగా ఉంటానని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గతంలో హామీ ఇచ్చారు. ఆ మాటకు అనుగుణంగా సోమవారం సుభాష్ వెంకటేశ్వరరావు భార్య భారతికి రూ.లక్ష ఆర్థికసాయం అందించారు. వారి ఇద్దరు కుమార్తెల విద్య, హౌసింగ్ రుణంతో పాటు ఇతర సంక్షేమ పథకాలు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. అదే గ్రామానికి చెందిన డయాలసిస్ పేషెంట్ కొర్లపాటి శ్రీరాములుకు రూ.20 వేల సాయం అందించారు. కార్యక్రమంలో రాజోలు ఎంపీపీ కేతా శ్రీనివాస్, టీడీపీ నేతలు కడలి కృష్ణమోహన్, వర్ధినేని వెంకట్రామయ్య, కూటమి నేతలు పాల్గొన్నారు.

వరద సహాయక చర్యల్లో కూటమి విఫలం


సఖినేటిపల్లి లాకుపేటలో ఆహారపొట్లాలు అందిస్తున్న పాటి శివకుమార్

సఖినేటిపల్లి: వరద భాదితులకు సహాయక చర్యలు అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ పాటి శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం సఖినేటిపల్లి లాకుపేటలో పర్యటించిన శివకుమార్ వరద బాధితులతో మాట్లాడి వారు పడుతున్న ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. వరద బాధితులకు గత ప్రభుత్వంలో ముంపుకు గురైన ప్రతి కుటుంబానికి వారి అకౌంట్‌లో నష్ట పరిహారం వేశారని ఇప్పుడు నష్ట పరిహారం కావాలంటే శిబిరాల్లోకి వచ్చి ఉంటేనే పరిహారం ఇస్తామని అధికారులు చెప్పడం దారుణమన్నారు. మంచినీరు తప్ప ముంపు కుటుంబాలకు ఆహారం, పిల్లలకు పాలు అందించలేకపోతున్నారన్నారు. ఇకనైనా వరద బాధితులకు సరైన భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సఖినేటిపల్లి లాకుపేటలో వరద బారిన పడిన 300 మందికి భోజన, పాల ప్యాకెట్లని శివకుమార్ పంపిణీ చేశారు. జిల్లెల్ల ఉదయ్‌కిరణ్, స్రవంతి, ఋషిం జాన్, క్రాంతికుమార్, కుసుమ చింటూ, పేదపాటి శ్యామ్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం


పాశర్లపూడిలో వరద బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మామిడికుదురు: వరద బాధితులను ఆదుకుంటామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. ఆయన సోమవారం పాశర్లపూడి, పాశర్లపూడిలంక మత్స్యకార ప్రాంతాల్లో పడవలో వెళ్లి పర్యటించారు. గోదావరి వరద బాధితులను పరామర్శించారు. గోదావరి వరదల వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఉచిత రేషన్‌తో పాటు నిత్యావసరాలు అందజేస్తామన్నారు. పంట నష్టపోయిన రైతులకు సైతం సహాయం అందించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట కూటమి నేతలు పాల్గొన్నారు.

పంటకాలువలో మృతదేహం

కొత్తపేట: మండలంలోని గంటి వద్ద పి.గన్నవరం ప్రధాన పంట కాలువలో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్టు స్థానిక ఎస్సై ఎం.అశోక్ తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంటి లంకపేట వద్ద సుమారు 40-45 ఏళ్ల వయసు గల గుర్తుతెలియని మగశవం నీటిలో తుప్పలకు అడ్డుకొని ఉండగా గంటి వీఆర్వో పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహంపై ముదురు గోధుమరంగు నిలువు చారల చొక్కా, సిమెంట్ రంగు ప్యాంటు ఉన్నవి. వీఆర్ఓ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. ఈ మృతదేహానికి సంబంధించి ఎవరికైనా ఆచూకీ తెలిస్తే సెల్ నంబర్ 9440904842కు ఫోన్ చేయాలని కోరారు.

కిడ్నీ బాధిత యువకుడికి విద్యార్థుల సాయం


రవీంద్రకు ఆర్థిక సాయం అందిస్తున్న విద్యార్థులు

పి.గన్నవరం: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఎల్.గన్నవరానికి చెందిన కొల్లు రవీంద్రకి అదే గ్రామానికి చెందిన జిల్లా, మండల పరిషత్ పాఠశాలల విద్యార్థులు సోమవారం రూ.34 వేల సాయం అందించారు. గ్రామ ప్రజల నుంచి విద్యార్థులు ఈ విరాళాన్ని సేకరించారు. అలాగే ఉపాధ్యాయులు కూడా రూ.4 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు స్వీట్లు, పండ్లు


కొత్తపేటలో విద్యార్థులకు స్వీట్స్, పండ్లు పంపిణీ చేస్తున్న హెచ్ఎం రామకృష్ణ, ఫౌండేషన్ సభ్యులు

కొత్తపేట: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం) శిక్షా సప్తాహ్ తిథి భోజనంలో అదనంగా జితేంద్ర సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వీట్లు, పండ్లు సమకూర్చారు. పాఠశాల హెచ్ఎం ఆర్.రామకృష్ణ మాట్లాడుతూ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ కార్యక్రమం నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రోజూ ఏర్పాటు చేసే భోజనంతో పాటు దాతల సహకారంతో స్వీట్స్, పండ్లు ఇవ్వాలని కోరగా జితేంద్ర సేవా ఫౌండేషన్ స్పందించిందన్నారు. ఆ మేరకు 380 మంది విద్యార్థులకు స్వీట్స్, పండ్లు సమకూర్చారన్నారు. వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల పీఎంసీ చైర్మన్ బీర శ్రీనివాసరావు, ఫౌండేషన్ చైర్మన్ మట్టపర్తి జితేంద్ర, సభ్యులు గంగుమళ్ల రాజు, బి.కిరణ్‌బాబు, ఎస్ఏ సత్తార్, బి.బాబ్జి తదితరులు పాల్గొన్నారు.